పరిశ్రమలకు సకాలంలో అనుమతులు

జిల్లా కలెక్టర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం: పరిశ్రమలకు సకాలంలో అనుమతులు జారీ చేయడంతో పాటు, యూనిట్ల స్థాపనపై దృష్టి పెట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ది డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రొమోషన్ కమిటీ) సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. జిల్లాలో కొత్త పరిశ్రమలకు అనుమతులు, పారిశ్రామిక వాడల స్థాపనకు ఉన్న అవకాశాలను, భూముల కేటాయింపు, రుణ మంజూరు తదితర అంశాలపై ఈ సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు అనుమతులను మంజూరు చేయాలని ఆదేశించారు. ఏ శాఖ వద్ద కూడా దరఖాస్తులు పెండింగ్ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించి, పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించాలని సూచించారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు, పెట్టుబడుల మొత్తం, వాటి ద్వారా కల్పించే ఉపాధి అవకాశాలపై నివేదిక ఇవ్వాలని అన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకానికి ఇప్పటివరకు మంజూరు చేసిన రుణాలు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. వీటి మంజూరు పట్ల దృష్టి కేంద్రీకరించాలని, విరివిగా రుణాలను అందజేయాలని సూచించారు. జిల్లాలో ఏపీఐఐసీకి ఇప్పటివరకు సుమారు 2,400 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, వాటిలో కేవలం 300 పైచిలుకు ఎకరాలను మాత్రమే వినియోగించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ భూముల వినియోగంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్, ఏడి రామకృష్ణ, విజయనగరం ఆర్‌డిఓ టి.సవరమ్మ, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, పరిశ్రమల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వీకులు అందించిన గొప్ప ఆస్తి యోగా..

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: మన పూర్వీకులు అందించిన గొప్ప ఆస్తి యోగా అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ క్షేత్రంలో కొలువుదీరిన రామనారాయణుని పాదాల చెంత రామధనుస్సు ఆకృతిలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ సహా సుమారు 1500 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు భక్తి ప్రపత్తులతో యోగాసనాలు వేశారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగ గురువులు డా.ఆరిశెట్టి ఇందుమతి, ఆరి సుందరశివరావులు కార్యక్రమంలో పాల్గొన్న అందరితో సుమారు 45 నిముషాల పాటు పలు యోగసనాలు వేయించారు. యోగాసనాల ప్రదర్శన అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ రామనారాయణ దర్శనాన్ని కల్పించడంతోపాటు తీర్ధ ప్రసాదాలను ఎన్.సి.ఎస్.ట్రస్టు ఆధ్వర్యంలో అందజేశారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జె.సి. సేతుమాధవన్, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పర్యాటక అధికారి కుమారస్వామి, డి.ఎస్.డి.ఓ. వెంకటేశ్వరరావు, డి.ఎం.హెచ్.ఓ. జీవనరాణి, ఆయుష్ అధికారి ఆనందరావు తదితరులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యోగా సాధన చేయడం ద్వారా మన శరీరాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.ఎస్.ట్రస్టు ప్రతినిధులు చంద్రకళ, రామనారాయణం మేనేజర్ శ్రీనివాసరావు, ఆయుష్ జిల్లా అధికారి డా.బి.వరప్రసాద్, యోగాంధ్ర ప్రత్యేక అధికారి ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ముందుకురండి

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాద్‌రావు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ప్రస్తుతం కళాశాలలు వేసవి సెలవలు కావడంతో విద్యార్థులు అందుబాటులో లేకపోవడం, వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో రక్తదానం చేయుటకు దాతలు తగ్గారని, రక్త సేకరణలో కళాశాల విద్యార్థుల పాత్ర గణనీయమని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాద్‌రావు అన్నారు. కళాశాలలు తెరుచుకొనుటకు వ్యవధి ఉన్నందున వాతావరణం కూడా చల్లబడటంతో రక్త నిల్వల కొరత భర్తీచేసేందుకు యువత, స్వచ్ఛంద సంస్థలు, రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు.

ప్రతిరోజు యోగా చేయండి... ఆసుపత్రులకు దూరంగా ఉండండి...

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఒక గంట యోగా చేసి ఆసుపత్రులకు దూరంగా ఉండాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతినిధి ఇప్పిలి అనంతం, జడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, డి.యల్.డి.ఓ. హేమసుందర్రావు, ఎంపీడీఓ యల్.త్రినాధరావు, తహశీల్దార్ రాజారావు, ఈఓ పిఆర్‌డి సురేష్, ఏ.ఓ. ప్రవీణ్, ఏపీఎం అప్పలనాయుడు తదితరులు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూలిలో మానవహారంగా ఏర్పడి యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును మెరుగుపరచడానికి ఒక సమగ్ర సాధన అన్నారు.

ఎండిఎం వర్కర్లకు, స్కూల్ ఆయాలకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఏప్రిల్ వేతనాలు, మార్చి, ఏప్రిల్ బిల్లులు, స్కూలు ఆయాలకు, వాచ్‌మెన్‌లకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే జీతాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జగన్మోహన్రావు మాట్లాడుతూ జూన్ 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, గత సంవత్సరం బిల్లులు, జీతాలు చెల్లించకపోతే పిల్లలకు ఏ విధంగా వండి పెట్టాలని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, గౌరవ వేతనం 10,000 ఇవ్వాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, వంట పాత్రలు, యూనిఫామ్ ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, ధనలక్ష్మి, లక్ష్మీ, సింహాచలం సరస్వతి, మంగ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

హత్యా.....ఆత్మహత్యా....?

విశాలాంధ్ర - రామభద్రపురం: అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆరిక తోట గ్రామంలో చోటు చేసుకుంది. ఇతన్ని ఎవరైనా చంపి పడేసారా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం తెలియ రాలేదు. శుక్రవారం గుర్తుతెలియని ఒక మృతదేహం నేలబావిలో తెలియాడుతూ కనిపించింది. స్థానిక ఎస్సై వెలమల ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు ఐదున్నర అడుగులు ఎత్తు 30 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఒక వ్యక్తి నేలబావిలో చనిపోయాడని తెలిపారు. ఇతను శరీరంపై సిమెంట్ కలర్ ప్యాంటు, రెడ్ కలర్ షర్టు ధరించి ఉందని అన్నారు. కుడి ఛాతి మీద ఒక పుట్టుమచ్చ, కుడి భుజంపై ఒక పుట్టుమచ్చ ఉందని అన్నారు. ఇతను శరీరమంతా ఉబ్బిపోయి ఉందని మృతి చెంది మూడు రోజులు అయ్యి ఉండవచ్చు అని తెలిపారు. గ్రామ విఆర్ఓ సహకారంతో మృతదేహాన్ని శవ పంచనామా కొరకు బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మండలానికి చేరుకున్న విద్యా మిత్ర-1 స్టూడెంట్ కిట్స్

విశాలాంధ్ర - భోగాపురం: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర -1 (స్టూడెంట్ కిట్స్) మండలానికి చేరుకున్నాయని మండల విద్యా శాఖాధికారులు రమణమూర్తి, చంద్రమౌళిలు తెలిపారు. వీటిని భోగాపురం ఆదర్శ పాఠశాల స్టాక్ పాయింట్‌లో భద్రపరిచామన్నారు. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, బాగ్స్, బెల్ట్స్, డిక్షనరీలు, లైబ్రరీ బుక్స్ వచ్చాయని, వీటిని ముందుగా ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆ తదుపరి ప్రాథమిక పాఠశాలలకు స్టూడెంట్స్ కిట్స్‌ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్‌లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పిడుగు పడి యువకుడు మృతి

విశాలాంధ్ర - వేపాడ : విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని శుక్రవారం కురిసిన భారీ వర్షంతో పాటు పడిన పిడుగులకు కృష్ణారాయుపేట గ్రామానికి చెందిన సిమ్మ శ్రీనివాసరావు (33) శెట్టిబలిజ కులస్తుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి గ్రామస్తులు, పోలీసులు అందించిన వివరాల ప్రకారం కృష్ణారాయుడు పేట గ్రామానికి చెందిన సిమ్మ శ్రీనివాసరావు ఎప్పటిలాగే శుక్రవారం మధ్యాహ్నం పశువులను మేతకు తోలుకొని వెళ్లగా శుక్రవారం సాయంత్రం 5గంటల సమయంలో కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సిమ్మ శ్రీనివాసరావు చిన్నతనంలో తండ్రి చనిపోవడంతో శ్రీనివాసరావుకి ఇద్దరు చెల్లెలు ఉండగా ఒక చెల్లెల్లకు వివాహం చేయగా రెండవ చెల్లికి వివాహం కాలేదని రెండవ చెల్లికి వివాహం చేసిన తర్వాత తన వివాహం చేసుకోవడానికి నిర్ణయించుకున్నట్లు తల్లి కృష్ణమ్మ తెలిపారు. ఈలోగా పిడుగుపాటు తన కుమారుడికి మృత్యువై తన కుమారుని కూడా దూరం చేసిందని వాపోయింది. మృతుడు శ్రీనివాసరావు తల్లి కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై ఎస్. సుదర్శన్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట సిహెచ్సికి తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు ఉండాలి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: హాస్టల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు ఉండేలా హాస్టల్ వార్డెన్లు శ్రద్ధ తీసుకోవాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి, చైర్మన్ ఎస్.విజయ్ చందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి ప్రభుత్వం మంజూరు చేసిన 16 లక్షల రూపాయల వ్యయంతో చేస్తున్న హాస్టల్ మరమ్మతు పనులను పరిశీలించారు. వార్డెన్ కొల్లి గౌరు నాయుడును సదు పాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చలుమూరు ప్రసాదు, కృష్ణ, నందిపల్లి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిమిడిలో కౌలు రైతుల గుర్తింపు సభ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: మండల కేంద్రంలోని తిమిడి గ్రామంలో కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు (కౌలు కార్డులు) జారీ చేస్తూ, వాటి ప్రయోజనాలను వివరించారు. విత్తనాలు, ఎరువులు, సబ్సిడీలు పొందడం, వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం, ధాన్యం కొనుగోలు వంటి లాభాలు ఈ కార్డు ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఎం.అరుణ కుమారి, మండల వ్యవసాయాధికారి కె.రవీంద్ర, వ్యవసాయ సహాయక అధికారులు వివేక్ పాల్గొన్నారు.

నెలివాడలో చెరువు గర్భం ఆక్రమణ

విశాలాంధ్ర - గజపతినగరం: బొండపల్లి మండలంలోని నెలివాడ గ్రామంలో గల రాజు చెరువు సర్వే నెంబర్ 6లో గట్టుపై రోడ్డు నిర్మాణంపై గ్రామానికి చెందిన మాజీ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు తాళ్లపూడి కృష్ణ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రాజు చెరువు గట్టును చదును చేసి గ్రామానికి అక్రమంగా మట్టిరోడ్డును ఎటువంటి అనుమతులు లేకుండా వేస్తున్నారని దీనివలన చెరువు ఆయకట్టు కింద పంట పొలాలను సాగు చేస్తున్న 6 గ్రామాలైన బిల్లలవలస, కెరటం, టెక్కలి, బూరాడ పేట, తుమ్మల వలసకు చెందిన రైతులకు సాగునీరు అందడానికి ఇబ్బంది వచ్చే అవకాశాలు ఉందన్నారు. సర్వే నెంబర్ 6లో 67.008 విస్తీర్ణం కలదని, చెరువు యొక్క ఆయకట్టు సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందించు సామర్థ్యం కలదని అన్నారు. గతంలో 1980లో సుమారు 98.067 సెంట్లు విస్తీర్ణంలో చెరువు గర్భం ఉండేదని, అయితే సుమారు 47 ఎకరాలు భూమి ఇప్పటివరకు అన్యాక్రాంతమైందని అధికారులు తక్షణమే స్పందించి కబ్జాదారుల నుండి చెరువు గర్భంను కాపాడి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కే.శంకర నాయుడు, పురంనేని బంగారు నాయుడు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మన సైనికుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కొనియాడారు. దేశం కోసం అశువులు బాసిన అమర జవాన్ల త్యాగం నిత్య స్మరణీయం అని పేర్కొన్నారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ తమ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన యుద్ధ స్థూపాన్ని, వాల్ ఆఫ్ హీరోస్ శిలాఫలకాన్ని కలెక్టర్ అంబేద్కర్ శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లాకు చెందిన అమర సైనికులకు ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల ధైర్య సాహసాలు, వారి త్యాగం ఎప్పటికీ మర్చిపోలేనివని కొనియాడారు. జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి త్వరలో సంబంధిత అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు. సైన్యంలో పనిచేస్తూ అశువులు బాసిన జిల్లాకు చెందిన సైనికుల కుటుంబాల్లోని 11 మంది వీరమాతలు, వీరనారిలకు, రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ తరపున 5000 చొప్పున నగదును అందజేసి, శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, డాక్టర్ వి.సత్యప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, ఎన్‌సిసి జిల్లా బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర, శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, ఆ శాఖ విశ్రాంత సహాయ సంచాలకులు రాజారావు, కార్పొరేటర్ విన్నింటి వరలక్ష్మి, సైనిక సంక్షేమ సంఘం నాయకులు దేవర ఈశ్వరరావు, ఆర్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

విశాలాంధ్ర - కొత్తవలస: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా కొత్తవలస ఎంపీడీవో పి.రమణయ్య ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఆర్పి పులిబంటి సతీష్ తెలిపారు. శుక్రవారం ముసిరాం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. చెట్ల పెంపకంతో మానవాళికి కలిగే ప్రయోజనాలను వివరించారు. సూచించారు. మే 22నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 5వ తేదీ వరకూ ఆయా గ్రామాల్లో కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవలతోనే రోటరీకి గుర్తింపు

విశాలాంధ్ర - బొబ్బిలి: సేవలతోనే అంతర్జాతీయ రోటరీ సంస్థకు సమాజంలో గుర్తింపు తీసుకు రావాల్సిన బాధ్యత రోటరీ నాయకులకు, సభ్యులపై ఉందని రోటరీ జిల్లా 3020 మెంబర్ షిప్ అధ్యక్షులు ఏవి రంగారావు సూచించారు. శుక్రవారం స్థానిక రోటరీ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ అధ్యక్షతన క్లబ్ అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రోటరీ సంస్థలో సేవ చేయగల, నిబద్ధత, మంచి నడవడిక, మంచి వృత్తి నైపుణ్యం కలిగిన వారిని సభ్యులుగా చేర్పించాలన్నారు. జిల్లా చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో చదివే 250 మంది విద్యార్థులకు పరుపులు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి, కార్యదర్శి ఎలెక్ట్ శివ కాంత్, ఫౌండేషన్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, రామ కృష్ణ, నాగరాజు, కృష్ణ మోహన్, శ్రీదేవి, కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర - రేగిడి: రేగిడి ఆమదాలవలస మండలంలోని బూరాడ గ్రామంలో స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ పద్మ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని పద్మ అన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించడానికి స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఎంపీడీఓ శ్యామలకుమారి ఆదేశాల మేరకు గ్రామాల్లో చైతన్యం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను సందర్శించిన జిల్లా న్యాయమూర్తి

విశాలాంధ్ర - గంట్యాడ: ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయమూర్తి ఎం భవిత సూచనలతో గంట్యాడ మండల కేంద్రంలో గల ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను శుక్రవారం మధ్యాహ్నం సీనియర్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సంస్థ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ సందర్శించారు. ముందుగా ఎస్సీ సంక్షేమ గృహాన్ని సందర్శించారు. మరమ్మతు పనులను స్వయంగా పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి గొర్రె గోవింద సన్యాసిరావు పాల్గొన్నారు. తదనంతరం బీసీ వసతి గృహాన్ని కూడా సందర్శించారు. భవనములో గల గదులు, పరిసరాలను, రికార్డుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహ సంక్షేమ అధికారి తెన్నేటి సీతరామశర్మ కూడా పాల్గొన్నారు.

డ్రైనేజీల మూసివేత... ఇళ్లలోకి వర్షపు నీరు....

విశాలాంధ్ర - జామి: మండల కేంద్రమైన మేజర్ పంచాయతీ జామిలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా జామి బస్టాండ్‌లో గతంలో తీసిన డ్రైనేజీలు పూర్తిగా కొందరు మూసివేయడంతో నీరు రహదారిపై ప్రవహించింది. అలాగే బస్టాండ్‌ను ఆనుకొని ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు వెళ్లడంతో ఆయా గృహాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కేవలం డ్రైనేజీలను మూసివేయడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని, వెంటనే గ్రామ పంచాయతీ ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా గృహాల యజమానులు పంచాయతీ పాలకులను కోరారు. కాలువలకు కొంతమంది అడ్డుకట్ట వేయడంతో నీరు రహదారిపై నిల్వ ఉండిపోతుందని పంచాయతీ అధికారులు తగిన ఆదేశాలు ఇవ్వాలని దుకాణదారులు కోరుతున్నారు.

ఉచిత గ్యాస్ నగదు జమ అయ్యేనా...!

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో ఇండియన్, హెచ్.పి గ్యాస్ కనెక్షన్ల వినియోగదారులకు నగదు జమ కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. మొదట విడతలో గ్యాస్ విడిపించే వారికి 48 గంటల్లో గ్యాస్ నగదు అకౌంట్లో జమ అవుతుందని ప్రభుత్వం చెప్పింది. కానీ కొన్ని కుటుంబలకు ఉచిత గ్యాస్ నగదు అకౌంట్లో జమ కాక నానా అవస్థలు పడుతున్నారు. అర్హులైన లబ్ధిదారులకు నగదు పడకపోతే గ్యాస్ ఏజెన్సీల్లో లేక పౌర సరఫరాల శాఖ అధికారులను అడగాలని మరికొంతమంది చెబుతున్నారు. అధికారులను అడిగితే ఈకేవైసీ అవ్వలేదని ఒకసారి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌కు లింకు అవ్వలేదని సాకులు చెబుతున్నారని వాపోతున్నారు. చివరకు ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉన్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండో విడతలో అయినా సబ్సిడీ నగదు పడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో...

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంఠ రాజపురం పంచాయతీలో గల ఎస్సీ, ఎస్టీ కాలనీలో మంచినీటి సమస్య గ్రామస్తులను వెంటాడుతోంది. రెండు సంవత్సరాలుగా తాగునీటికి ఇక్కట్లు పడుతున్నప్పటికీ అధికారులకు ఫిర్యాదు చేసిన నేటికీ పట్టించు కోకపోవడంతో ఎస్సీ, ఎస్టీ కాలనీ మహిళలు తాగునీరు ఇప్పించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నుండి కొళాయిలకు తాగునీరు వదలగానే గ్రామంలో డబ్బున్న ధనికులు కొళాయి పైపులకు మోటార్లు అమర్చి వాటి ద్వారా వారి ఇళ్లల్లో ఉన్న వాటర్ ట్యాంకులకు స్టోరేజ్ చేసుకోవడంతో ఎస్సీ, ఎస్టీ కాలనీ వాసులకు నీరు అందడం లేదని వాపోతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటింటికి తాగునీరు అందించాలన్న సదుద్దేశంతో జలజీవన్ మిషన్ పథకం అమలు చేసినా నీలకంఠరాజపురంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఎస్సీ, ఎస్టీలకు తాగునీరు అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని మండిపడుతున్నారు. ఈ గ్రామంలో దశాబ్దాల కాలం క్రిందట మంచినీటి పథకం నిర్మించినా అది శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా గ్రామస్తుల అవసరాలకు తాగునీరు అందించ లేకపోతోంది. అలాగే గత మూడు నెలలుగా పంచాయతీ కార్యదర్శి సచివాలయంలో అందుబాటులో లేక అనేక అవస్థలు పడుతున్నామని, ఇన్‌చార్జి పేరుతో పంచాయతీ కార్యదర్శి టి.కన్నం నాయుడును నియమించినా ఆయన అందుబాటులో లేకుండా పోయారని తద్వారా త్రాగునీటి సమస్య మరింత ఎక్కువైందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సిహెచ్ సూర్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి టి.కన్నం నాయుడులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.

దళితులకు నీరందించకపోవడం దారుణం

గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీకి తాగునీరు అందించకపోవడం అన్యాయం. ఎన్నిమార్లు పంచాయతీ కార్యదర్శితో పాటు మండల అధికారులకు విన్నవించినా తన మాటను లెక్కచేయడం లేదు. గ్రామంలో దళిత సర్పంచ్‌గా నా మాట లెక్కచేయడం లేదని వాపోయారు. ఎస్సీ ఎస్టీలకు రక్షిత మంచినీటి మంచి పథకం నిర్మించాలని కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రక్షిత మంచినీటి పథకం మంజూరు అయిందని చెప్పడమే తప్ప నేటికీ నిర్మించలేదు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాను.

- గ్రామ సర్పంచ్ గుడివాడ దేవి

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - గజపతినగరం: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బి కళ్యాణి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.కోటలో జూన్ 10న యోగాంధ్ర రాష్ట్ర స్థాయి కార్యక్రమం

5 వేల మంది ఉపాధి వేతనదారులతో నిర్వహణకు ఏర్పాట్లు
జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ ఆదేశాలు

విశాలాంధ్ర -విజయనగరం: ఉపాధి వేతనదారులతో జూన్ 10వ తేదీన రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎస్.కోటలో నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ వెల్లడించారు. సుమారు 5 వేల మంది వేతనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి అధికారి తదితరులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వుందని దీనిని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. యోగాంధ్ర రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ శుక్రవారం తన ఛాంబరులో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఐదు వేల మంది పాల్గొనేందుకు అనువైన ప్రాంగణాన్ని గుర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొనే వారంతా నిర్ణీత సమయానికి ప్రాంగణంలో వుండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డ్వామా అధికారులకు సూచించారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థులకు 15 రకాల పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని మండలాల్లోనూ పెద్ద ఎత్తున యీ పోటీల్లో విద్యార్థులు, యువత పాల్గొనేలా, నిర్ణీత సమయంలోగా పోటీలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డ్వామా పి.డి. శారదాదేవి, వ్యవసాయశాఖ జె.డి. రామారావు, డి.ఎస్.డి.ఓ. వెంకటేశ్వరరావు, డి.ఎల్.డి.ఓ. రోజారాణి, హౌసింగ్ పి.డి. మురళీమోహన్, పర్యాటక అధికారి కుమారస్వామి, సెట్విజ్ సి.ఇ.ఓ. సోమేశ్వరరావు, డి.ఇ.ఓ. మాణిక్యాలనాయుడు, మెప్మా పి.డి. చిట్టిరాజు, డి.ఎం.హెచ్.ఓ. జీవనరాణి, జిల్లాపరిషత్ డిప్యూటి సి.ఇ.ఓ. వెంకటరామన్ పాల్గొన్నారు.

జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా గదుల వెంకటరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో విజయనగరం జిల్లా అధ్యక్షునిగా గదుల వెంకటరావును నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా స్థానిక విజయనగరం లోని పలువురు బీసీ నాయకులు వెంకటరావుని అభినందించారు. ఈ సందర్భంగా నూతన బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన గదుల వెంకటరావు మాట్లాడుతూ బీసీ కులాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. దేశంలో కుల గణన జరిపితే బీసీల అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లాలో బీసీలకు భవన నిర్మాణం జరపాలన్నారు.

పారిశుధ్య ప్రక్షాళనకు ప్రాధాన్యం

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో పారిశుధ్య ప్రక్షాళనకు ప్రాధాన్యతిస్తున్నట్లు విజయనగరం కమిషనర్ పల్లి నల్లనయ్య వెల్లడించారు. ఆయన ఆదేశాలతో నగరంలో వివిధ ప్రాంతాలలో ప్రజారోగ్య సిబ్బందితోపాటు ప్రత్యేక పని వారలు పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఎక్కడ చెత్తాచెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ చేసిన సూచనలతో సిబ్బంది చెత్తలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో కాలువల్లో పూడిక లేకుండా యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నామన్నారు. అయితే పూడిక తీస్తున్న సమయంలో కొన్నిచోట్ల చెత్తలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందికి ఆదేశించడంతో అన్ని ప్రాంతాలలో పరిశుభ్రత చర్యలు చేపట్టారన్నారు. ప్రజలు కూడా శుభ్రతను పాటించి ఎక్కడబడితే అక్కడ చెత్తలను, తినుబండారాలను వేయరాదని చెప్పారు. వ్యాపార కూడళ్ళో వ్యాపారస్తులు,చిరు వ్యాపారులు నిరుపయోగమైన పళ్ళు, కూరగాయలు వంటివి రహదారులపై పారబోయరాదని చెప్పారు. తప్పనిసరిగా డస్ట్ బిన్లను వినియోగించుకోవాలని సూచించారు.

5న మొక్కలు నాటే కార్యక్రమం

విశాలాంధ్ర - విజయనగరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5వ తేదీన నగరంలో వివిధ ప్రాంతాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాలతో ప్లాంటేషన్ సిబ్బంది ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో మొక్కలు నాటేందుకు అవసరమైన గోతులను తవ్వుతున్నారు. గోతులు తోవ్వే ప్రక్రియలను డిఈలు,ఏఈలు స్వయంగా పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా అన్ని ప్రాంతాలలో విరివిగా మొక్కలు నాటాలన్న ఆదేశాలతో చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే గోతులను తవ్వే ప్రక్రియను ప్రారంభించినట్లు చెప్పారు. దాదాపు 5వేలకు పైగా మొక్కలను నాటనున్నట్లు చెప్పారు. అయితే ఆయా మొక్కలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై కూడా ఉందన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. మానవాళి మనుగడకు మొక్కలే ప్రధాన కారణం అన్న విషయాన్ని గుర్తుతెరగాలని చెప్పారు.

జూన్ 1న వైసీపీ కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర - వేపాడ: జూన్ 1న ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు మమ్ములూరు జగ్గి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యకర్తల సమావేశం కొత్తవలస వైసీపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందన్నారు. శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించబోయే కార్యకర్తల సమావేశానికి మండలంలో ఉన్న సీనియర్ నాయకులు ఎంపీపీ, జడ్పీటీసీలు, ముఖ్య నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

ఎండ తీవ్రత తగ్గినట్టే...

విశాలాంధ్ర - తెర్లాం: తరుచుగా వర్షాలు కురవడం వలన ఈ సంవత్సరం వడగాల్పులు తీవ్రతకు తగ్గినట్లే అని పలు గ్రామాల్లో ప్రజలు అంటున్నారు. ఏప్రిల్ నుంచి మే నెల 30 వ తేదీ వరకు 7సార్లు వర్షాలు కురవడంతో భూమి అతి వేగంగా చల్లగా బడి మూగ జీవులైన గొర్రెలు, పశువులు, మేకలు తినేటందుకు ఆహారానికి చెట్లు భూమి మీద గడ్డి అతి వేగంగా పచ్చపడడం , మూగ జీవులు త్రాగేటందుకు నీరు చెరువుల్లో, బావుల్లో నిల్వ ఉండడం వలన ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వేసవి కాలంలో మే నెల మండుటెండల్లో అతి వేగంగా చల్ల బడడంతో పలు రకాల ఖరీఫ్ సాగుకు కూడా రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

తాగునీటి బోరుకు హెడ్ నిర్మాణం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని ఆకుల సీతంపేట గ్రామానికి చెందిన బంగారమ్మ తల్లి ఆలయం సమీపంలో తీయించిన బోరు బావికి హెడ్ నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ నిధులు రూ.1లక్ష 20వేలతో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు ఈ బోరుబావిని తీయించారు. సోంపురం వేపాడ ఆర్ అండ్ బి రహదారికి ఆనుకొని ఈ బోరు బావి తీయించడం వలన ప్రయాణికులకు కూడా తాగునీటికి ఉపయోగపడుతుందని, అలాగే బంగారమ్మ తల్లి ఆలయం నిర్మాణం ప్రారంభంలో ఉన్నందున ఆలయ నిర్మాణానికి కూడా ఈ బోరుబావి ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆతవ సర్పంచ్ గొంప వేమన రాము, వైసీపీ నాయకులు భోజంకి శ్రీనివాసరావు, కిలపర్తి మురళి, అడపా హరీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపకారాగారం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: విజయనగరం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏ.కృష్ణ ప్రసాద్ శృంగవరపుకోటలోని ఉప కారాగారాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల సమస్యలు, అందుతున్న వసతులు, ఆహారం నాణ్యత మొదలైన అంశాలను పరిశీలించారు. తనిఖీ అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ కేసుల సమస్యలు ఉంటే వాటిని జైలు సూపరింటెండెంట్ ద్వారా మండల న్యాయ సేవా కమిటీకి దరఖాస్తు చేయాలని, తగిన పరిష్కారం చూపిస్తామని తెలిపారు. జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో జైలు సూపరింటెండెంట్, జైలు సందర్శక న్యాయవాది టీ.వి.రమణమూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌ను పెంచాలి

విశాలాంధ్ర- వంగర: యోగాంధ్రా రిజిస్ట్రేషన్‌ను గ్రామాల్లో పెంచాలని ఎంపిడిఓ రఘునాథాచారి పంచాయతీ సెక్రటరీలకు ఆదేశించారు. శుక్రవారం మండల సమావేశ మందిరంలో 19 గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. యోగాంధ్రా సిటిజన్స్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేసి పెంచాలనీ వారికి సూచించారు. వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాదులు ప్రబల కుండా ముఖ్యంగా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, కాల్వల్లో మురుగు తదితర వాటిపై శ్రద్ధ తీసుకోవాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడవలసిన బాధ్యత మీపై ఉందన్నారు. కొండ చాకరాపల్లి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించని విషయం పత్రికల్లో శుక్రవారం వెలువడిన సమయానికి ముందే తాళం అన్న కథనంపై స్పందిస్తూ ఆ సచివాలయ సిబ్బందికి అందరికీ మెమోలు జారీ చేసినట్లు చెప్పారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు: జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాల యంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తి పరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధ్యం

జూలై 9 సమ్మెను జయప్రదం చేద్దాం
సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేష్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎన్‌పిఆర్ శ్రామిక భవన్, ప్రజా సంఘాల కార్యాలయం నందు సీఐటీయూ పతాకావిష్కరణ జరిగింది. జిల్లా కార్యదర్శి ఏ జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కే.సురేష్ మాట్లాడుతూ ఐక్యత పోరాటం నినాదంతో 1970లో సీఐటీయూ ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు అనేక నిర్బంధాలను ఎదుర్కొని కార్మిక వర్గ ఐక్యత కోసం, పెట్టుబడిదారీ విధానాన్ని, శ్రమ దోపిడీని, అమెరికా సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకిస్తూ దేశ ఐక్యత, సమగ్రత, ప్రభుత్వ రంగ పరిరక్షణ, కార్మిక, ఉద్యోగ హక్కుల కోసం నికరంగా పోరాడుతుం దన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 19 జాతీయ సమ్మెలు నిర్వహించడంలో సిఐటియు కీలకపాత్ర వహించిందని, రైతాంగ, వ్యవసాయ కూలీల పోరాటాలకు సంఘీభావంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సోషలిజమే పరిష్కారమని, కార్మిక వర్గ రాజ్య స్థాపన ద్వారానే సాధ్యమన్నారు. కార్మిక వర్గ ఐక్యతకు ఆటంకంగా ఉన్న మతతత్వ, కులతత్వ, ప్రాంతీయ విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులతో కలిసి కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని వ్యవసాయ కూలీలను తీవ్రమైన శ్రమ దోపిడీకి గురి చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుందని, ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిస్తుందన్నారు. అందుకే జులై 9 న దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. పథకావిష్కరణలో సిఐటియు జిల్లా కార్యదర్శిలు యూఎస్ రవికుమార్, బి.రమణ, జిల్లా కమిటీ సభ్యులు కే.గురుమూర్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి వి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా చక్కటి మార్గం

విశాలాంధ్ర - విజయనగరం: పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా చక్కటి మార్గమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ సెంటర్, గాంధీ విగ్రహం వద్ద యోగాసనాలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వెంకటలక్ష్మి జంక్షన్ వరకు వరకు ర్యాలీ నిర్వహించి యోగ విశిష్టతను తెలియపరిచే విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నెలరోజుల పాటు యోగాంధ్ర 2025 పేరిట రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈరోజు గాంధీ విగ్రహం ప్రాంతంలో యోగాసనాలు వేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు యోగా పట్ల అవగాహన పెంచుకొని సులభతర రీతిలో యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యం మరింత మెరుగుగా ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శారీరక, మానసిక ఉల్లాసానికి యోగ దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, బ్యాట్మెంటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మంగళపాలెంలో చోరీ ప్రదేశాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ ఇంట్లో జరిగిన చోరీలో భారీ ఎత్తున బంగారు ఆభరణాలు, నగదు పోయిన ఘటనపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. కొత్తవలస సిఐ షణ్ముఖరావు, ఎస్.కోట సిఐ ఎస్.వి.మూర్తి తదితరులతో కలిసి మంగళపాలెం గ్రామంలోని చోరీ జరిగిన ప్రదేశాన్ని ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు గంటపాటు ఆయన ఘటన స్థలంలో ఆయన పలువురితో విడివిడిగా చర్చించారు. దొంగతనానికి ముందు, తరువాత జరిగిన అంశాలను బాధితుడు రాపర్తి జగదీశ్ కుమార్ ఎస్పీకి వివరించారు. సుమారు 90 తులాల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదు అపహరణకు గురికావాడాన్ని బాధిత కుటుంభ సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. చోరీకి పాల్పడ్డ వారిని త్వరగా పట్టుకుని పూర్వికులనుంచి ఆచారంగా వస్తున్న అమ్మవారి ఆభరణాలను, సొత్తుని రికవరీ చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ను వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు బాలగాలతో ముమ్మరంగా తనికీలు చేపడుతున్నామని, త్వరలోనే చోరీకి పాల్పడ్డ వారిని పట్టుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం కేసు పురోగతిపై సిబ్బందితో సుదీర్ఘ చర్చలు జరిపి వారికి పలు సూచనలు చేశారు.

జూన్ 4న వైసిపి.... వెన్నుపోటు దినోత్సవం
- అనకాపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ ధర్మశ్రీ

విశాలాంధ్ర - చోడవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అనకాపల్లి పార్లమెంటు వైసిపి ఇన్చార్జ్, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో జూన్ 4న చోడవరం పట్టణంలో వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల పార్టీ శ్రేణులు, ప్రజా

ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. చోడవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాలుగు మండలాలు పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. జూన్ 4 నాటి కార్యక్రమాల నిర్వహణ విధి విధానాలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రెండు నియోజకవర్గాలకు ప్రధాన వనరులుగా ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం హాయంలో 130 కోట్ల రూపాయలు గ్రాంట్‌గా అందజేసి ఇటు ఫ్యాక్టరీని రైతాంగాన్ని, కార్మికులను ఆదుకున్నామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కనీసం 10 కోట్ల రూపాయలు కూడా తేలేకపోయారని విమర్శించారు. అలాగే జూన్ 4 నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించిన ఎంపీపీలు జడ్పీటీసీలు పార్టీ అధ్యక్షులు కన్వీనర్లు, సంబంధిత ముఖ్య నేతలు హాజరయ్యారు.

పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి

విశాలాంధ్ర - విజయనగరం: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఇంటి పరిసరాలలో నీరు నిల్వలు ఉండి దోమలు వృద్ధి కేంద్రాలుగా తయారవుతాయని చెప్పారు. ఆయన ఆదేశాలతో పారిశుద్ధ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు సచివాలయాల వారీగా ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రజలలో డ్రైడే గురించి అవగాహన కల్పించారు. నీటి నిల్వలను ఎక్కడికక్కడ తొలగించి వేశారు. ముఖ్యంగా మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నీటి నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు అధికంగా ఉత్పత్తి అవుతాయని అన్నారు. చిన్నచిన్న గోతులు, నిరుపయోగమైన టైర్లు, కొబ్బరి చిప్పలు, పెంకులు, ఫ్రిడ్జ్ అడుగు భాగంలోను, ఎయిర్ కూలర్ల లోను, నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవలన్నారు. ఇందుకోసం ప్రతి ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే వాటిని నశింపజేయాలని చెప్పారు. తమ సిబ్బంది ప్రతిరోజూ యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నారని తెలిపారు.

భవన నిర్మాణ సామగ్రి విచ్చలవిడిగా వేస్తే కఠిన చర్యలు
- మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలో భవన నిర్మాణాల్లో ఉపయోగించే సామగ్రిని విచ్చలవిడిగా వేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి హెచ్చరించారు.

శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్ నిర్వహణలో భాగంగా మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పట్టణ ప్లానింగ్ విభాగం యొక్క పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న టౌన్ ప్లానింగ్ పనులకు సంబంధించి భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు ఎవరు కూడా బిల్డింగ్ నిర్మాణ సామాగ్రిని రోడ్లపై విడిచిపెట్టకూడదని, అలా విడిచిపెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు, అనధికారిక ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లపై తక్షణమే తగు చర్యలు తీసుకొని, అనధికారికంగా ఏర్పాటు చేసే వారిపై పెనాల్టీలు వేయవలసిందిగా ఆదేశించారు.

బిల్లులు చెల్లించకుంటే గడ్డి తిని బ్రతకాలా..!
9వారాల బిల్లులు రాలేదంటూ ఉపాధి కూలీల నిరసన

విశాలాంధ్ర - కొత్తవలస : 9 వారాలుగా ఉపాధి హామీ పనులు చేసిన బిల్లులు మంజూరు కాకపోవడంతో కొత్తవలస మండలం కొత్తసుంకరపాలెం గ్రామంలోని చెరువు వద్ద ఉపాధి కూలీలు గడ్డి తిని బ్రతకాలా అంటూ ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం కూలీలు గడ్డి, ఆకులు తిని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గాడి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం 9వారాలుగా ఉపాధి హామీ బిల్లులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. నిరుపేద కుటుంభాలు ఏం తిని బ్రతకాలో అర్థంకాని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే బకాయి బిల్లులు విడుదల చేసి కూలీలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల బ్రతుకులతో ఆట్లాడితే పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు వీ.నూకరత్నం, పి.ఈశ్వరమ్మ, అశ్వని, అనంత, బి.లలిత, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-మునగపాక: సోషల్ మీడియా,ఆపరిచిత పరిచయాలు,సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అన్నపూర్ణ అన్నారు.మేజర్ పంచాయతీ మునగపాకలో అంగన్వాడి కేంద్రం -2 లో కిశోర వికాసం కార్యక్రమంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్తవయస్సులో ప్రవేశించిన బాలికల స్వేచ్ఛకు భంగం కలగకుండగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.18 సంవత్సరాల వయసు నిండకముందు పెళ్లిలు చేయడంతో సంసార జీవితాన్ని మోయలేక ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందన్నారు.బాలికలకు బలవంతంగా వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మహిళ హక్కులు,చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.కిశోర బాలికలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె అన్నారు.బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా మునగపాక అంగన్వాడి టీచర్లు పెంటకోట హేమలత,టెక్కలి సరస్వతి,బొడ్డేడ రేవతి పద్మ,డ్వాక్రా వివోఏలు,కిశోర బాలికలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.